విద్యార్థులకు విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలి

● కలెక్టర్ హనుమంతరావు

బీసీ గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 22 : మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహార భోజనం తోపాటు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని అనంతారం బీసీ గురుకుల పాఠశాలను బుధవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలను, భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంట సరుకులలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా హాస్టల్ సరుకులు, కూరగాయలు సప్లయ్ చేస్తే వారిపై, సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యత లేని కూరగాయలు సప్లయ్ చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేశారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి : ప్రభుత్వ విప్ బీర్ల

కొలనుపాకలో విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆలేరు రూరల్, జనవరి 22 : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని కొలనుపాకలో గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బుధవారం బహుమతుల ప్రదానోత్సవం చేశారు. గ్రామ యువ నాయకుడు భీమగోని సంతోష్‌గౌడ్ ప్రథమ బహుమతికి రూ.15వేలు, ద్వితీయ బహుమతికి రూ.10వేలు అందజేవారు. విద్యావేత్త గాదె సోమిరెడ్డి షీల్డ్‌లు బహూకరించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణుగోపాల్, పిడి జోసెప్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జనవరి 22 : భారత ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఈ నెల 25న 15వ జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ఓటు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, ఓటు హక్కుపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా ముఖ్యమైందని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని సమాజాభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. ఈ నెల 25న ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీలో ప్రజలు, ప్రభుత్వ అధికారులు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదుపై సందేహాలు ఉన్నవారు, సమాచారం కావాలనుకుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950కు కాల్ చేసి వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి రమణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ నేతకు పల్లె రవి పరామర్శ

సహదేవ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్

సంస్థాన్ నారాయణపురం, జనవరి 22 : బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేశ్ తండ్రి సహదేవ్ ఇటీవల మృతిచెందారు. కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రామచంద్ర నాయక్ గురువారం రమేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సహదేవ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహ, నాయకులు సుర్వి యాదయ్య గౌడ్, కట్టెల భిక్షపతి, జంగయ్య గౌడ్, స్వామి, యాదయ్య, మల్లేశ్, శేఖర్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలులో ప్రభుత్వం విఫలం

నాంచారిపేటలో డప్పు ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మోటకొండూర్, జనవరి 22 : ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆడెపు శ్రీనివాస్ మాదిగ అన్నారు. మండలంలోని నాంచారిపేటలో ఎమ్మార్పీఎస్ బుధవారం ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలాపన చేస్తూ మాదిగలను మోసం చేస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు, వేయి గొంతుల భారీ ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో డప్పు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంధమల్ల జమంగీర్, నాయకులు మధు, కరుణాకర్, నర్సింహ, ఉప్పలయ్య, భిక్షపతి, స్వామి పాల్గొన్నారు.

ఈ నెల 25న ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ధర్నా

చౌటుప్పల్, జనవరి 22 : ఈ నెల 25న ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక సమక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంట్‌ను 28కిలోమీటర్ల నుంచి 40కిలోమీటర్లకు మార్చాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ధర్నాకు ఉమ్మడి నల్లగొండ, మెదక్ జిల్లాల భూ నిర్వాసితులు కుటుంబ సభ్యులతో సహా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రకటన తెలిపిన వారిలో ఐక్యవేదిక కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి, నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, దబ్బేటి రాములు గౌడ్, జాల వెంకటేశ్ యాదవ్, జాల శ్రీశైలం యాదవ్, బోరెం ప్రకాశ్‌రెడ్డి, సందగళ్ల మల్లేశ్‌గౌడ్, వల్లూరి బోగయ్య, నాగవెళ్లి దశరథ గౌడ్ ఉన్నారు.

మదర్ డెయిరీకి సర్కారు గ్రాంట్ ఏమైంది

● ఎన్నికల సమయంలో హామీ ఎందుకు ఇచ్చారు?
● ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్తుల అమ్మకాన్ని అడ్డుకుంటాం
● అవసరమైతే హైకోర్టును ఆశ్రయించి నిలుపుదల చేయిస్తాం
● డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : మదర్ డెయిరీకి ప్రభుత్వం నుంచి ఇప్పిస్తామన్న గ్రాంట్ ఏమైందని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. నార్మాక్స్ ఎన్నికల సమయంలో క్యాంప్ రాజకీయాలకు తెరలేపి మంత్రులు, ఎమ్మెల్యేలతో హామీలు ఇచ్చిన మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. ఎన్నికల్లో గెలిచాక రైతులను మోసం చేసేలా చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. భువనగిరిలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకవర్గం హయాంలో రోజుకు 90వేల లీటర్ల పాల మార్కెటింగ్ జరిగిందని, ఇప్పుడు 40వేల లీటర్లకు దిగజార్చారని మండిపడ్డారు. ప్రస్తుత పాలకవర్గం అసమర్థత వల్లే డెయిరీకి నష్టాలు పెరిగాయన్నారు. మదర్ డెయిరీలో 70శాతం పాలు యాదాద్రి జిల్లా నుంచే వెళ్తున్నాయని, సంస్థను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని, దీని ద్వారా వేలాది మంది రైతులు ఆగమయ్యే పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్‌లో నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్నికల హామీ ప్రకారం బోనస్ ఇవ్వకపోగా, లీటరుపై రూ.4 తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల్లో మదర్ డెయిరీ పాలను కాదని విజయ డెయిరీకి అప్పగించాల్సిన అవసరం ఏం వచ్చిందన్నారు. పక్కా ప్లాన్ ప్రకారం డెయిరీని కాలగర్భంలో కలిపే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. డెయిరీ ఆస్తులను కాపాడే ప్రయత్నం చేయాలని, ఉన్న ఆస్తులను అమ్మడం ఏంటని ప్రశ్నించారు. అవకతకవలకు పాల్పడేందుకు స్థిరాస్తుల అమ్మకాలను ముందుకు పెట్టారని, విక్రయించగా వచ్చిన డబ్బుల్లో కొంత మేర పాలకవర్గం సభ్యులు వాటాలు పంచుకుంటారనే ప్రచారం జరుగుతున్నదని అన్నారు. ఆస్తులను అమ్మితే సంస్థతోపాటు ఉద్యోగులు, రైతులు రోడ్డున పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మదర్ డెయిరీ ఆస్తుల అమ్మకాలను అడ్డుకుంటామని తెలిపారు. అవసరమైతే హైకోర్టును ఆశ్రయించి నిలుపుదల చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ చైర్మన్ కొలుపుల అమరేందర్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీద రవీందర్ పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● డీఈఓ సత్యనారాయణ

సంస్థాన్ నారాయణపురం, జనవరి 22 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి మార్కులు సాధించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి రూ.1.50లక్షలతో 50రోజుల పాటు అల్పాహారం అందించేందుకు విరాళం అందజేశారు. పరీక్ష ప్యాడ్లను సమకూర్చారు. వాటిని డీఈఓ సత్యనారాయణ బుధవారం విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమాదేవి, ఉపాధ్యాయులు ఉషారాణి, హనుమంతు, ఉదయ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గోరీలను కూల్చిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

● కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం హెచ్చరిక

తుక్కాపురంలో ధ్వంసమైన స్మశాన వాటికను పరిశీలిస్తున్న కుల వివక్ష పోరాట సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 22 : గోరీలను కూల్చి శ్మశాన వాటికను ఆక్రమించుకున్న నిందితులను అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి అన్నంపట్ల కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని తుక్కాపురం గ్రామంలో సర్వే నెంబర్ 113లోని 1.20గుంటల భూమిలో గల శ్మశాన వాటికలో ధ్వంసమైన గోరీలు, సమాధులను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గామానికి చెందిన కంఠం దయాకర్, కంఠం దినేశ్ రాత్రికి రాత్రి జేసీబీలతో గోరీలను కూల్చి, బొందలను తవ్వి బాయి కుంటలో పోయడాన్ని ఖండిస్తున్నామన్నారు. నిందితులపై ఈ నెల 5న పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకడం లేదని తెలిపారు. ఈ నెల 30లోపు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కులవివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ లింగం, మాజీ సర్పంచ్ నోముల పద్మ, మాజీ ఎంపీటీసీ నల్లమాసు శారద, మాజీ ఉప సర్పంచ్ ముంత సతీశ్, గ్రామ ప్రజలు, బాధితులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాల కోసం మోకాళ్లపై ప్రదర్శన

చెరువులు నింపాలని మోకాళ్లపై నడిచి నిరసన తెలుపుతున్న రైతులు

రాజాపేట, జనవరి 22 : కాళేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా మండలంలోని గొలుసుకట్టు చెరువులు నింపి సాగు జలాలు అందించాలని రైతులు బుధవారం మండల కేంద్రంలో మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జలసాధన సమితి మండల కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్ మాట్లాడుతూ సాగు జలాలు అందించే వరకు పోరాటం చేస్తామన్నారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, పాలకులు వెంటనే స్పందించి ఇచ్చిన మాట ప్రకారం చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు కుమ్మరి లక్ష్మణ్, కాకాల ఉపేందర్, నాగపురి పుల్లయ్య, ఎండీ సలావుద్దీన్, ఎర్రగోకుల కృష్ణ, బాలనర్సయ్య, లక్ష్మీ నర్సయ్య, లింగాల సీతారాములు, సంగం వేణుగోపాల్, గొల్లపల్లి శ్రీనివాస్, చింతల కిష్టయ్య పాల్గొన్నారు.

గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

చౌటుప్పల్, జనవరి 22 : గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాంధారి ప్రభాకర్ అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల శాఖ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న పట్టణంలోని గాంధీ పార్కులో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో గాంధీ ఫొటో గ్యాలరీ, ఎద్దు గానుగ ప్రదర్శన, బాల గాంధీ వేషధారణలు, చేనేత వస్త్రాల ప్రదర్శన, గాంధీజీ విగ్రహాల ఏర్పాటు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీపీ కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, ప్రతినిధులు ఉజ్జిని మంజుల, పోలోజు శ్రీలత, బొబ్బిళ్ల సంధ్య, వనం మమత, భవానీ పాల్గొన్నారు.

24న విద్యుత్ వినియోగదారుల సదస్సు

నల్లగొండ సిటీ, జనవరి 22 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నల్లగొండలోని ఎస్ఈ కార్యాలయంలో సీజీఆర్ఎఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం సదస్సుకు వచ్చే వినియోగదారులు తమ ఆధార్‌కార్డు, కరెంటుబిల్లు తీసుకొని రావాలని సూచించారు.

మీ సేవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి : తాసీల్దార్ వెంకటేశ్వర్లు

నార్కట్‌పల్లి, జనవరి 22 : మండలంలోని మీ సేవ, ఆధార్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని తాసీల్దార్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో మీ సేవ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రాల్లో ధరల పట్టిక పెట్టాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే మీ సేవా సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆర్ఐ తరుణ్ ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు, జనవరి 22: మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన పోలె వెంకన్న అక్రమంగా నిల్వ ఉంచిన 10 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధు తెలిపారు.

తిరుమలగిరి(సాగర్) : మండలంలోని రంగుండ్ల గ్రామంలో రేషన్ డీలర్ ఆంగోతు రుక్మ కొడుకు ఆంగోతు శంకర్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు బుధవారం తెల్లవారాజామున డీసీఎంలో లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు సీఐ బీసన్న తెలిపారు. సుమారు 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని శంకర్‌పై, డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్ఐ వీరశేఖర్, ఆర్ఐ లక్ష్మీకాంత్ ఉన్నారు.

మిర్యాలగూడ : కేతావత్‌తండాకు చెందిన కోటమ్మ రేషన్ బియ్యాన్ని సేకరించి లారీలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు వన్ టౌన్ ఇన్‌చార్జి సీఐ నాగార్జున తెలిపారు. 50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నింతులు పోతుగంటి శ్రీనివాస్‌రావు, మచ్చ రవిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కోటమ్మ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎస్ఐ సైదిరెడ్డి ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తింపు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ రూరల్, జనవరి 22: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నా పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని బుద్ధారం, అప్పాజీపేట గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో పాల్గొని మాట్లాడారు. రాములబండ గ్రామ సభలో నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఖాజీరామారం, పాతూరు, గుండ్లపల్లిలో జరిగిన గ్రామ సభల్లోనూ అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ ప్రజలు అధికారులను నిలదీశారు.

బీఆర్ఎస్ హయాంలోనే పార్కుల అభివృద్ధి

చందంపేట(దేవరకొండ), జనవరి 22 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే దేవరకొండలోని ఖిల్లా వద్ద మున్సిపల్ పార్క్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గాజుల ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం దేవరకొండ ఖిలా పార్క్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే రూ.5కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. ఇటీవల పార్క్‌ను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో లోహిత్‌రెడ్డి, సత్యనారాయణ, రమేశ్‌నాయక్, బాబా, పొట్ట మధు, జానిబాబా, తరి గోవర్ధన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తాం : ఎమ్మెల్యే కుంభం

భువనగిరి అర్బన్, జనవరి 22 : పట్టణంలోని 3, 11, 13, 14, 18, 21, 23, 25, 27వ వార్డుల్లో బుధవారం వార్డు సభలు నిర్వహించారు. 25వ వార్డు సభకు హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామన్నారు. ఉపాధి హామీ కూలీలకే ఆత్మీయ భరోసా అంటున్నారని, తాము హైదరాబాద్‌లో ఉంటాం.. తమకు ఎలా? అని ఎమ్మెల్యేను కొందరు ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ, కౌన్సిలర్లు రత్నపురం బలరాం, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రగతిశీల ఉద్యమాలతో బీజేపీ ఫాసిస్ట్ విధానాలను తిప్పికొట్టాలి

మాట్లాడుతున్న మైస శ్రీనివాస్

ఆలేరు టౌన్, జనవరి 22 ప్రగతిశీల ఉద్యమాలతోనే బీజేపీ ఫాసిస్ట్ విధానాలను తిప్పికొట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, కె.గోవర్ధన్ అన్నారు. పట్టణంలోని ఏఎన్ఆర్ గార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన పీవైఎల్ సంఘాల విలీన సభలో వారు మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చి భారత దేశాన్ని పూర్తిగా హైందవీకరించడానికి విఫలయత్నం చేస్తుందన్నారు. అడవులను, సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు, అంబానీ, అదానీకి కట్టబెడుతుందని, సంపదంతా సంపన్న వర్గాలకు దోచిపెడుతుందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో అన్నలను, ఆదివాసులను అడవుల నుంచి దూరంచేసి 2026లోపు ఆదానీకి అప్పగించబోతుందని తెలిపారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బండారు ఐలయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్, నాయకులు కోలా లక్ష్మీనారాయణ, బేజాడి కుమార్, రమేశ్, రవి, సిద్దేశ్వర్, చందర్, ఆర్.సీత, నాగరాజు, సోమయ్య, శ్రీకాంత్ , సిద్దులు, సమరసింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉదయ్, మధు, పరమేశ్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి'

భువనగిరి అర్బన్, జనవరి 22 : మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఈఓ కార్యాలయం ఏడీ ప్రశాత్‌రెడ్డికి బుధవారం వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్ల సాధనకు ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటలు బంద్ చేసి కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, నాయకులు ముంతాజ్ బేగం, నిర్మల, పారిజాత, పుష్ప, గంగమ్మ, కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు
● బీఆర్ఎస్‌లో చేరిన ఎన్ఆర్ఐ దంపతులతో పాటు కాంగ్రెస్, టీడీపీ నాయకులు

ఎన్ఆర్ఐ దంపతులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, జనవరి 22 : పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. దామరచర్ల మండలం రాళ్లవాగుతండాకు చెందిన ఎన్ఆర్ఐ (ఆస్ట్రేలియా) ధీరావత్ రాయమల్, స్రవంతి దంపతులతోపాటు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ధీరావత్ బాలాజీనాయక్, ధీరావత్ అశోక్ నాయక్, టీడీపీ నాయకులు ధీరావత్ అశోక్, ధీరావత్ చందర్ భాను, ధీరావత్ రాజు, సపావత్ రాందాస్, లచ్చునాయక్, మాన్ తండాకు చెందిన మాలోతు హరి, లావూరి వెంకట్రామ్‌తోపాటు పలువురు బుధవారం మిర్యాలగూడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో భాస్కర్‌రావు సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్నింటా ముందుందని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీని సంస్థాగతంగా పటిష్ట పరచాలని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమనేనని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దామరచర్ల మండలాధ్యక్షుడు దుర్గంపూడి నారాయణ రెడ్డి, నాయకులు ఎండీ యూసుఫ్, ఆంగోతు హాతీరాంనాయక్, బైరం సంపత్, కుందూరు వీరకోటిరెడ్డి, సోము సైదిరెడ్డి, ధీరావత్ పున్నానాయక్, బాల సత్యనారాయణ, లావూరి శ్రీనునాయక్, అక్కురామ్ నాయక్, రఫీ, రవీందర్‌నాయక్, సైదానాయక్, శ్రీను, నాగు, మహేష్, చిన్నబాబు, బాలు, కృష్ణ శ్రీరాములు, లచ్చునాయక్, దస్రు, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

నీలగిరి, జనవరి 22 : గంజాయి విక్రయించడంతో పాటు బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాం రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వన్